# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-03-2026 సమయం : సాయంకాలం 6గం. 20ని.లు

## ముఖ్యాంశాలు

- ఈ ఏడాది మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు.
- మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డి అన్నారు.
- ఐసిసి పురుషుల క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మరి కాసేపట్లో ప్రారంభం కానుంది.

==========================

ఈ ఏడాది మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రాజధాని అమరావతిలో రాష్ట్రస్థాయి మహిళా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సమక్షంలో 36 ఒప్పందాలపై అధికారులు సంతకాలు చేశారు. డ్వాక్రా ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ కోసం స్వయం బ్రాండ్ పేరు, లోగో ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళాభ్యున్నతికి పని చేస్తున్నాయని తెలిపారు. స్వయం శక్తి సంఘాల ద్వారా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారని ముఖ్యమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో 2025-26 ఆర్థిక సంవత్సరంలో వివిధ

పథకాల బ్యాంకు లింకేజి కింద సమకూర్చిన 1,013.23 కోట్ల రూపాయల విలువైన మెగా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన అంధ మహిళా క్రికెటర్ పి. కరుణ కుమారిని ఘనంగా సత్కరించారు. సమసమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. ప్రభాకర రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. మహిళల పురోగతికి విద్య అత్యంత కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలకు సూచించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కలెక్టర్ కృతిక శుక్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.
తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈ రోజు నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని అన్నారు. జిల్లాలో గత సంవత్సరం కాలంలో 10 వేల మంది మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించడమే సమాజ పురోగతికి పునాది అని రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలో ఈ రోజు నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో బాలిక విద్యను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. మహిళలు ఇప్పుడు వ్యాపార వేత్తలుగా రాణిస్తూ.. సమాజాభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్నారని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

==========================

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బాల్య వివాహ విముక్తి ప్రచార రథాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాల వలన కలిగే అనర్ధాలను ఈ రథం ద్వారా మారుమూల ప్రాంతాల్లో ప్రచారం చేయాలన్నారు. గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, బాలికల హక్కులపై ప్రజల్లో చైతన్యం కలిగించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని అన్నారు.

==========================

బాలికలు, మహిళలు క్రీడలలో సత్తా చాటాలని చిత్తూరు జిల్లా యువజన విభాగం అధికారి బి.ప్రదీప్ కుమార్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రోజు చిత్తూరులో విద్యార్థినులకు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం బాలికలు, మహిళలను క్రీడలలో ప్రోత్సహించేందుకు అస్మిత - ఖేలో ఇండియా పేరిట క్రీడా పోటీలను నిర్వహిస్తోందని తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఐసిసి పురుషుల క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఈ రోజు రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు భారత్ రెండు సార్లు టీ-20 ప్రపంచ కప్ గెలవగా, న్యూజిలాండ్ 2021లో ఫైనల్ కు చేరి రన్నరప్ గా నిలిచింది. ప్రపంచ కప్ టీ-20 ఫైనల్‌కు చేరడం భారత్ కు ఇది నాలుగో సారి.

==========================

వసతి గృహాల విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించి.. పై చదువులకు ప్రోత్సహించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సైనీ అధికారులకు సూచించారు. ఈ రోజు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని పలు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, గదులు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు తదితర వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి... విద్యాభ్యాసం, ఆహార నాణ్యత, ఆరోగ్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను విజయ భారతి సైనీ ఆదేశించారు.

==========================

సమాజ ప్రగతిలో మహిళల పాత్ర కీలకమని, అది అద్భుతమైన మార్పుకు నాంది పలుకుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అమరావతిలో ఆమె ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడారు.

==========================

==========================